క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలో చేసిన పలు అభివృద్ధి పనులను ఎంపీడీఓ సరిత మంగళవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, వన నర్సరీ, పార్కులను పర్యవేక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఆమె వెంట సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మంత్రి శ్రీధర్‌బాబు తదితరులను కలిశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, కోఆర్డీనేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్, బుక్క పాండురంగారెడ్డి, వత్తుల నారాయణ, బుక్క మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా పైప్‌లైన్ పనులు ప్రారంభం



నాదర్‌గుల్‌లో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ గ్రీన్‌హోమ్స్ కాలనీలో నూతనంగా కృష్ణా వాటర్ పైప్‌లైన్ల నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ నిమ్మల సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి హాజరైనారు. ప్రతి ఇంటికి కృష్ణా వాటర్ అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్‌యాదవ్, శ్రీరామ్‌రెడ్డి, బంగారి అశోక్, చల్మారెడ్డి, సునిల్, కిష్టయ్య, అభిషేక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించుకున్నారు. అనంతరం సామూహిక శ్రీ సత్యానారాయణ వత్రాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కబ్జా ఆపాలంటూ వినతి

కందుకూరు: మండలంలోని సార్లరావులపల్లి పరిధిలోని పోచమ్మగడ్డతండాలో అక్రమంగా బోరు, పంపుసెట్టు చుట్టూ ప్రహరీ నిర్మించి కబ్జా చేస్తున్నారంటూ తండాకు చెందిన వి.సత్యవతి మంగళవారం ఎంపీడీఓ సరితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తన వ్యవసాయ పొలం సర్వే నంబర్ 26/ఈ లో ప్రభుత్వం నుంచి బోరు, చేతి పంపు ఏర్పాటుతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మె నిర్మించడానికి భూమి ఇచ్చామన్నారు. ప్రస్తుతం అందులో తండాకు చెందిన నేనావత్ రవి, లక్ష్మీ ఆ బోరు, చేతి పంపు చుట్టూ ప్రహరీ నిర్మించి కబ్జా చేస్తున్నారని సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 27, క్యారెట్ 21. దొండ 43, ఆలు 21, ఉల్లి 19. **గమనిక:** ఈ ధరలు బుధవారం ఉదయం పదిగంటల వరకు వర్తిస్తాయి.

ఉత్సవాలకు ముస్తాబు

రేపటి నుంచి శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ముస్తాబవుతున్న ఆలయం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీ చీకటి వేంకటేశ్వరస్వామి గుహాలయంలో ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైయింది. అక్కడ స్వయంభూగా వెలసిన చీకటి వేంకటేశ్వర స్వామి, శ్రీలక్ష్మీవేంకటేశ్వరునిగా, కల్యాణ వైభవ వేంకటేశ్వరునిగా, అగస్త్య తిరుమలేశ్వరుడిగా, సంతాన వేంకటేశ్వరునిగా గుహాలయంలో ఉత్తరాన కొలువై ఉన్నారు. గుహాలయంలో మానవ నిర్మితం కాకుండా రాయిపై శంకు, చక్రాలతో సహజ సిద్ధంగా ఏర్పడింది. 4 నుంచి 6వ శతాబ్ది కాలంలో కీసర రాజధానిగా పరిపాలన చేసిన విష్ణుకుండినులు ఈ దేవాలయాన్ని దర్శించి శ్రీస్వామి వారి సేవలో పునీతులైయ్యారు. శ్రీభగవత్ పాదుల ఆదిశంకరాచార్యులు దేవాలయాన్ని దర్శించి శ్రీఅగస్త్యేశ్వర శివ లింగ ప్రతిష్ఠాపన చేశారు. తదనంతరం అక్కన్న, మాదన్నలు పలుమార్లు స్వామి వారిని దర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చరిత్ర. శ్రీభక్తరామదాసు విడుదల కావాలని ఇక్కడే మొక్కుబడి చేసుకున్నారు. ఆయన విడుదలతో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి కొన్ని ఎకరాల భూమిని సైతం ఇనాంగా ఇచ్చారు. అక్కన్న, మాదన్నల జ్ఞాపకార్థం, వారి సమీప బంధువులు గోల్కొండ వ్యాపారులతో ఈ దేవాలయాన్ని నిర్మింపజేశారట. నాటి నుంచి నేటి వరకు స్వామి వారు భక్తుల చేత పూజలందుకుంటున్నారు.

పూజా కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు 22న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై అభిషేకం, ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. మహాగణపతి, నవగ్రహ, మహాలక్ష్మీ, సుదర్శన హోమం నిర్వహించనున్నారు. 23న ప్రత్యేక పూజలతో పాటు మహాగణపతి, నవగ్రహ, లక్ష్మీసుదర్శన హోమాలు చేయనున్నారు. 24న శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం, 25న సామూహిక సత్యానారాయణ వ్రతాలు, మహాగణపతి, నవగ్రహ, లక్ష్మీసుదర్శన హోమాలు కొనసాగనున్నాయి. 26న దేవతామూర్తులకు అభిషేకాలు, పూజలతో పాటు హోమాలు చేపట్టి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొకరాల రాజశేఖర్‌శర్మ తెలిపారు. ఆయా రోజుల్లో భక్తులకు అన్నప్రసాదం అందించనున్నామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి సేవలో తరలించాలని కోరారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



ఉత్సవమూర్తులు

యాదయ్య చిరస్మరణీయుడు



యాదయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, రాంమోహన్‌గౌడ్

హుడాకాంప్లెక్స్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కొత్తపేట చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పలువురు నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పోరాడి అమరుడైన సిరిపురం యాదయ్య చిరస్మరణీయుడని కొనియాడారు. ఎంతోమంది ఉద్యమకారుల ఫలితంగానే ఈ రోజు తెలంగాణ ఆవిర్భవించిందని, ఉద్యమకారులను గుర్తించి వారిని అన్ని విధాలా ఆదుకునేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముద్దగోని రాంమోహన్‌గౌడ్, నాయకులు బేర బాలకిషన్ వినయ్ కుమార్, ఉపేంద్రయాదవ్, ధనరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి మారుబోనం

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ తల్లి మారు బోనం మంగళవారం వైభవంగా కొనసాగింది. ఆలయ ధర్మకర్త విఠల్ బాబా పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్థానిక కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దూడల శ్రీనివాస్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు సహకరించిన ప్రభుత్వ అధికారులకు విఠల్ బాబా ధన్యవాదాలు తెలియజేశారు.



పూజలో పాల్గొన్న విఠల్‌బాబా

విజయ సంకల్ప యాత్రకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

బీజేపీ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్

మహేశ్వరం: బీజేపీ విజయ సంకల్ప యాత్ర గురువారం మహేశ్వరం మండలం చిన్నతూప్ర గ్రామానికి చేరుకుంటుందని ఆ పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చారి అధ్యక్షతన మంగళవారం బీజేపీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాపయ్యగౌడ్ మాట్లాడుతూ... చిన్నతూప్ర నుండి అమీర్‌పేట్, మన్సాన్‌పల్లి చౌరస్తా అక్కడి నుంచి మహేశ్వరం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీజేపీ కై వసం చేసుకుంటుందన్నారు. యాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్య యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సహ కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా పార్టీ కార్యదర్శి యాదయ్య గౌడ్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు యాదీశ్, మండల అధ్యక్షుడు మాధవచారి, గిరిజనమోర్చా నాయకులు పంతునాయక్, యువ, దళిత, కిసాన్, మహిళ మోర్చా అధ్యక్షులు శ్రావణ్, శ్రీశైలం, శ్రీనివాస్ యాదవ్, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

తహసీల్దార్‌కు ఏబీవీపీ నేతల వినతి

ఇబ్రహీంపట్నం: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతకు ఏబీవీపీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా కన్వీనర్ సాయిచరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యావ్యవస్థపై సమీక్ష నిర్వహించలేదన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి విద్యనభ్యసిస్తుంటారన్నారు. అయితే ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్, నగర కార్యదర్శి మహేందర్, ఎస్‌ఎఫ్‌ఎస్ విభాగ్ కన్వీనర్ సాయికిరణ్, పవన్, ఆదర్శ్, శివ, దీపక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్‌కు విద్యానగర్ కాలనీవాసుల వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నూతన కమిషనర్ వసంతను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే నూతన కమిషనర్ వసంతను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు.. రవి, మహేశ్‌యాదవ్, గోపి, నర్సింహ, రాములు, శ్రీను, ప్రశాంత్, సురేశ్, భారతమ్మ తదితరులు ఉన్నారు.

వారసత్వ సంపదను కాపాడుతాం

ఎమ్మెల్యే సబితారెడ్డి



మెట్లబావి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: ప్రాచీన వారసత్వ సంపదను భావితరాలకు అందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలంలో రూ.90 లక్షల నిధులతో జరుగుతున్న కొనేరు(మెట్ల బావి) పునరుద్ధరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పురాతన, ప్రాచీన కట్టడాలు కనుమరుగు కాకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరం మెట్లబావి పునరుద్ధరణ పనుల కోసం రూ.90 లక్షల నిధులను మంజూరు చేయించామన్నారు. పనులు నాణ్యతతో త్వరితగతంగా పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామం కేకే బస్తీలోని చర్చి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు సుధాకర్‌రెడ్డి, అంబయ్య యాదవ్, థామస్‌రెడ్డి, సమీర్, రాజు నాయక్, ఆదిల్, ప్రభాకర్, బాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వానం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ నిర్వాహకుడు రాజశేఖర్‌శర్మ మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎ.అంజయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు సదానంద్‌గౌడ్, దేవీలాల్‌నాయక్ తదితరులున్నారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా భూపతి



పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్ స్టేషన్ నూ తన ఇన్‌స్పెక్టర్‌గా భూపతి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన వెంకట్ రెడ్డి సాధారణ బదిలీ కాగా.. ఆయన స్థానంలో 2007 బ్యాచ్‌కు చెందిన భూపతి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సున్నితమైన స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

దళితవాడలకు నిధులివ్వండి

తలకొండపల్లి: మండలంలోని దళితవాడలను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల చైర్మన్ చెన్నకేశవులు మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డిని కోరారు. చీపునుంతల–సాలార్‌పూర్ మట్టి రోడ్డు మార్గంలో బీటీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే ఈ మార్గం మధ్యలో అవసరమైన చోట కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. చీపునుంతలకు సీసీ రోడ్డు మంజూర్ చేసినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ప్రగతే లక్ష్యం

- 2023-24 ఏడాదికి గాను ఎస్ఎస్‌జీలకు రూ.40 కోట్ల రుణాలు
- ఆర్థిక పురోగతి సాధిస్తున్న మహిళలు
- ప్రతీనెల సమావేశాలతో చైతన్యం
- రుణపరిమితి పెంచుతామంటున్న అధికారులు



కుర్మిద్దలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన ఉద్యోగులు

యాచారం: మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పనిచేస్తోంది. బ్యాంకుల నుంచి విరివిగా రుణాలు అందజేయిస్తూ మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా బలోపేతం కావడానికి అధికారులు సంకల్పించారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల(ఎస్ఎస్‌జీ)కు 2023-24 ఏడాదికి బ్యాంకు లింకేజీ కింద రూ.42 కోట్ల రుణాలు ఇప్పించడానికి టార్గెట్ ఉంది. దీనికి సంబంధించి అర్హత కలిగిన 921 సంఘాలను అధికారులు గుర్తించారు. వీటిలో దాదాపు 9వేలకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు.

రూ.40కోట్ల టార్గెట్ పూర్తి..

యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో అర్హత కలిగిన 921 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.42.32 కోట్ల రుణాలు ఇప్పించాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. అందులో ఇప్పటివరకు 891 సంఘాలకు రుణాలు ఇప్పించారు. ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించారు. మండలంలోని మేజర్ గ్రామాలైన యాచారం, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, గునుగల్, నక్కర్తమేడిపల్లి, చింతపట్ల, మాల్ తదితర గ్రామాల్లోని మహిళా సంఘాలకు రూ.కోట్లాది రుణాలు ఇప్పించారు. కొన్ని చిన్న గ్రామాల్లో మహిళలు వాయిదా బకాయిలను సక్రమంగా చెల్లించడంతో ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించారు. మొండిగౌరెల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లోని మహిళా సంఘాలకు కూడా రూ.కోట్లాది రుణాలు ఇప్పించారు. ఫిబ్రవరి 18 వరకు రూ.40 కోట్లకు పైగా రుణాలు ఇప్పించడంతో పాటు మరో రూ.2కోట్లకు పైగా రుణాలు ఇప్పించేందుకు గాను అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

స్వయం కృషితో ఆర్థిక పురోగతి..

స్వయం సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు డబ్బులను వృథా చేసుకోలేదు. రుణాలు పొంది వ్యవసాయ పంటల్లో పెట్టుబడులు, చిరు వ్యాపారాలు, గొర్రెల, మేకల, పాడిగేదెల కొనుగోళ్లు, చేతి వృత్తులు తదితర వాటిలో పెట్టుబడులు పెట్టారు. వచ్చిన ఆదాయంతో ప్రతీనెల అప్పుతో కూడిన వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. మహిళల అప్పు వాయిదా చెల్లింపులను బట్టి ఆయా బ్యాంకుల మేనేజర్లు అడిగిందే తడవుగా రూ.లక్షలాది రుణాలు ఇచ్చేస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు కూడా ప్రతీనెల క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తుండటంతో మహిళలు కూడా చిరువ్యాపారాల ద్వారా పొందే ఆదాయంతో అప్పులు చెల్లించుకుంటున్నారు.

అంతా చెత్తమయం!

- డివిజన్‌లో పడకేసిన పారిశుద్ధ్యం
- కంపుకొడుతున్న పరిసరాలు
- దోమల విజృంభణ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి ఫుట్‌పాత్‌లపై చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. దీనికి తోడు చెత్త డబ్బాల వద్ద క్రమంగా చెత్తను తొలగించక పోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పేరుకుపోయిన చెత్తా చెదారం దోమలకు ఆవాసాలుగా మారి దోమల బెడద పెరిగిందని స్థానికులు చెప్తున్నారు. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసనకు అనారోగ్యం పాలవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్తకుప్పల వద్దే కొందరు బహిరంగ మల, మూత్ర విసర్జనకు పాల్పడుతుండటంతో పరిసరాలు మరింత దుర్గంధ భరితంగా తయారవుతున్నాయి. కాలనీల్లో కార్మికులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించే విధంగా చూడాలని డివిజన్‌వాసులు కోరుతున్నారు. నిత్యం ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యం పాలవుతున్నాం

చెత్తకుప్పలు పేరుకుపోవడం వలన ఎగసివస్తున్న దుర్వాసనతో పాటు దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు పారిశుద్ధ్యం పనులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. దీంతో కాలనీ రోడ్లు చెత్తకుప్పలకు నిలయాలుగా మారుతున్నాయి. అధికారులు సమస్యను పరిష్కారించాలి.

– జహంగీర్, ఎన్‌టీఆర్‌నగర్

అనాథ విద్యార్థి గృహానికి విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం చిత్ర లేఅవుట్‌లోని విద్యార్థి గృహానికి దిల్‌సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ ఉపాధ్యాయులు, 10 తరగతి విద్యార్థులు కలిసి రూ. 40 వేల విలువైన వెజిటబుల్ కటింగ్ మిషన్, వ్యాక్యూమ్ క్లీనర్, గ్రైండర్ తదితర వస్తువులను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా పుల్లారెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ మాట్లాడుతూ, విద్యార్థి గృహంలోని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విరాళంగా గ్రైండర్ తదితర వస్తువులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు